క్లుప్తంగా

గోకుల్ కళాశాలలో లేంప్ లైటింగ్ వేడుకలు



లేంప్ లైటింగ్ వేడుకల్లో పాల్గొన్న అతిథులు

బొబ్బిలి: మండలంలోని పిరిడి గోకుల్ కళాశాలలో నర్సింగ్ విద్యార్థుల లేంప్ లైటింగ్ ఓత్ టేకింగ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బొబ్బిలి ఎన్నారై ఎండీ శ్రీనివాసన్ సింధ్రి, డాక్టర్ వాణీ గాయత్రి హాజరై నర్సింగ్ విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. గోకుల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుమలత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మొదటి మహిళా నర్స్ అయిన ఫ్లోరెన్స్ నైటింగేట్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రిస్కిల్లా, గోకుల్ విద్యా సంస్థల అధినేత బొట్టా వెంకట రమణ పాల్గొన్నారు.

స్పోర్ట్స్ మీట్‌లో విద్యార్థుల ప్రతిభ



వాలీబాల్ పోటీల్లో తలపడుతున్న విద్యార్థులు

బొబ్బిలి: మండలంలోని కోమటిపల్లిలో గల భాస్కర ఫార్మసీ కాలేజ్‌లో శుక్రవారం స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ కొణతాల రాజేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ క్రీడోత్సవంలో క్రికెట్, ఖోఖో, టెన్నిస్, వాలీబాల్ ఆటల్లో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు పంపిణీ చేశారు. చైర్మన్ టీఎస్ఎస్ కార్తీక్ మాట్లాడుతూ నిత్యం క్రీడల వలన మానసిక, శారీరక ప్రశాంతత అలవడుతుందన్నారు. చైర్మన్ తూముల భాస్కరరావు మాట్లాడుతూ ఏటా క్రీడా పోటీలను నిర్వహిస్తామని తెలిపారు.

ఆధ్యాత్మిక భావాలు వెల్లివిరియాలి



ప్రతిష్ఠ మహోత్సవాల్లో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి, శ్రీకాంత్ తదితరులు

బొబ్బిలి: ప్రజలందరిలో ఆధ్యాత్మిక భావాలు పెంపొందాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. పట్టణంలోని గొల్లపల్లిలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు తల్లిదండ్రుల జ్ఞాపకార్థం నూతనంగా నిర్మించిన శ్రీరామాలయ ప్రతిష్ఠ మహోత్సవాల్లో ఆయన శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంబంగి మాట్లాడుతూ ఆలయ నిర్మాణాలు చేపట్టడంతోనే భగవంతుని ఆశీస్సులు మనపై ఎల్లవేళలా ఉంటాయన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొన్నారు. జేసీఎస్ జిల్లా ఇన్‌చార్జి శంబంగి శ్రీకాంత్ స్థానిక నాయకులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

బెల్లపు ఊట ధ్వంసం

బొబ్బిలి: సర్కిల్ పరిధిలోని రాభద్రపురం మండలం కారిందొరవలస గ్రామంలో 2200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు ఎస్ఈబీ సీఐ బీవీ మురళీధరరావు ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం నిర్వహించిన దాడుల్లో బెల్లం ఊటతో పాటుగా పది లీటర్ల సారాయిని సీజ్ చేశామన్నారు. దాడుల్లో ఎస్ఐలు ఎస్వీ రామారావు, ఎల్.తిరుపతిరావు, సిబ్బంది బి.ఆదినారాయణ, ఇంటెలిజెన్స్ టీం కానిస్టేబుల్ రవికుమార్ పాల్గొన్నారు.

రేగిడి పీహెచ్‌సీలో అత్యాధునిక పరికరాలు

రేగిడి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే సదుద్దేశంతో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అత్యాధునిక పరికరాలను ఏర్పాటుచేశారు. రక్త పరీక్షలు నిర్వహించేందుకు రూ.4 లక్షల విలువైన హిమటాలజీ ఎన్‌లైజర్, బయోకెమిస్ట్ తదితర పరికరాలను ఏర్పాటు చేశారు. 63 రకాల రక్త పరీక్షలను ఒకే దఫా చేసుకునేందుకు వీలుంటుందని వైద్యాధికారి డాక్టర్ ఆసిరినాయుడు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి రక్తపరీక్షలకు డబ్బులు వృథా చేసుకోకుండా ఇక్కడ రేగిడి పీహెచ్‌సీకి వచ్చి రక్తపరీక్షలు చేయించుకోవచ్చునని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

ఉపాధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

రేగిడి : రైతులు ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర టెక్నికల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కిరణ్ కోరారు. మండలంలో లక్ష్మీపురం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ రోజు చెరువులు, కాలువల్లోనే ఉపాధి హామీ పనులు చేయకుండా, రైతులకు సంబంధించిన పండ్ల తోటల్లో కూడా ఉపాధి పనులు చేసుకోవచ్చునని వెల్లడించారు. కందకాలు ఏర్పాటుచేసి వర్షపు నీటిని నిల్వ చేసుకునేందుకు ఫారంపాండ్లు కూడా ఉపాధి హామీతోనే చేసుకోవచ్చునని వివరించారు. రాష్ట్ర టెక్నికల్ రిసోర్సుపర్సన్ సుధీర్, ఏపీడీ శ్రీనివాసరావు, ఏపీఓ హరనాథరావు, టెక్నికల్ అసిస్టెంట్ రామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు కుట్రలతోనే పింఛన్‌దారులకు కష్టాలు

- ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే శంబంగి



కోడూరులో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి బెల్లాన, పక్కన ఎమ్మెల్యే శంబంగి

బాడంగి: రాష్ట్రంలో సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలతో ప్రజలకు అందుతున్న సేవలను చూసి చంద్రబాబు కుట్రలు పన్ని పింఛన్‌దారులకు కష్టాలు తెచ్చిపెట్టారని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని కోడూరు, బాడంగి గ్రామాల్లో ఎమ్మెల్యే శంబంగి వెంకటచినఅప్పలనాయుడుతో కలసి శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గ్రామాల్లో ప్రతి వీధిలో ప్రచారం చేసి ఓటర్లను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. సచివాలయ వ్యవస్థతో జాతిపిత గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం వచ్చిందన్నారు. నవరత్నాల పథకాలతో ప్రజలకు మేలు చేస్తానని హామీ ఇచ్చిన జగనన్న వాటిని చేసి చూపించారన్నారు. జగనన్న పాలనలో పేదల ఆర్థిక పరిస్థితులు గణనీయంగా మెరుగుపడ్డాయన్నారు. దీనికి కారణం రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలే కారణమని పేర్కొన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కొలేక టీడీపీ ఇతర పార్టీలతో జతకట్టి వస్తుందని ఆ కూటమికి రాబోయే ఎన్నికల్లో ప్రజలే గుణపాఠం చెప్పాలన్నారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లలా పాలన ముందుకు సాగుతుందని దీన్ని ప్రజలు గుర్తించి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలన్నారు. అంతకు ముందు వారికి ఆయా గ్రామాల్లో ప్రజలు ఘన స్వాగతం పలికారు. మహిళలు విజయ తిలకం దిద్ది, హారతులు ఇచ్చారు. ప్రచారంలో జిల్లా జేసీఎస్ కన్వీనర్ శంబంగి శ్రీకాంత్, జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, ఎంపీపీ భోగి గౌరి, సర్పంచ్ బోగి జ్యోతి, మాజీ సర్పంచ్ తెంటు నారాయణరావు, జేసీఎస్ కన్వీనర్ మరిపి శంకరరావు, తెంటు మధుసూదనరావు, రెడ్డి కృష్ణ, పార్టీ అధ్యక్షుడు బి.వెంకటనాయుడు, మరడ రమణ, పలు గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తీరిన రహదారి కష్టాలు



బీటీ రోడ్డు నిర్మాణం తరువాత రోడ్డు (నేడు)



గతంలో అధ్వానంగా రోడ్డు

మండలంలోని రెడ్డిపేట గ్రామానికి పాలకొండ - రాజాం రహదారి నుంచి కిలోమీటరు మేర బీటీ రోడ్డును రూ.2.85 లక్షలతో నిర్మాణం చేపట్టారు. రూరల్ రోడ్డు ప్రాజెక్టు ద్వారా ఈ రహదారి నిర్మించినట్టు ఏఈ ఆనందరావు తెలిపారు. ఏళ్లుగా గోతులతో ఉన్న రహదారిలో బీటీ రోడ్డు వేయడంతో రెడ్డిపేట గ్రామస్తులు సంబరపడుతున్నారు.

– రేగిడి

రాజన్నకు మద్దతుగా ప్రచారం



ఇంటింటికి వెళ్లి ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మెంటాడ: డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొరకు మద్దతుగా అందరూ నిలబడి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి మళ్లీ గెలిపించాలని మండల పార్టీ అధ్యక్షుడు రాయిపిల్లి రామారావు అన్నారు. శుక్రవారం లోతుగెడ్డ సచివాలయం పరిధి గిరిజన గ్రామాల్లో ప్రచారం చేశారు. ప్రతి ఇంటికీ వెళ్లి జగనన్న చేస్తున్న అభివృద్ధి సంక్షేమం గురించి వివరిస్తూ ఓటు వేయాలని అభ్యర్థించారు. తోటవలస, కొండపర్తి, సారవానివలస, బాసలపాడు, ఎర్రవానివలస, ఉయ్యడవలస, గైరమ్మపేట ప్రచారం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఈశ్వరరావు, సర్పంచ్ భీమారావు, వైస్ సర్పంచ్ పైడపునాయుడులు, వైఎస్సార్ సీపీ నాయకులు అచ్యుత్, రత్నాకర్ నాయుడు, రాజప్పల నాయుడు, బాయి అప్పారావు, మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

చల్లని వేళల్లో పనులు చేయండి

రాజాం సిటీ: ఉపాధిహామీ వేతనదారులు రెండు పూటలా చల్లని వేళల్లో పనులు చేయాలని ఏపీఓ కె.సాయిరాం అన్నారు. మండల పరిధి శ్యాంపురం గ్రామంలో చేపడుతున్న ఉపాధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. వేతనదారుల మస్టర్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం రెండు పూటలా పనులకు హాజరు కావాలని సూచించారు. రూ.300 వేతనం గిట్టుబాటు అయ్యేలా కొలతలు ప్రకారం పనులు చేయాలని అన్నారు. జాబ్‌కార్డు ఉన్నవారు మాత్రమే పనులకు హాజరు కావాలని సూచించారు. ఆయన వెంట టీఏ సాయిరాం తదితరులు ఉన్నారు.

బొబ్బిలిలో బీసీల సత్తా చాటాలి

- నియోజకవర్గం పార్టీ పరిశీలకుడు మామిడి వాసునాయుడు



మాట్లాడుతున్న నియోజకవర్గం పార్టీ పరిశీలకుడు మామిడి వాసునాయుడు

రామభద్రపురం: రానున్న సార్వత్రిక ఎన్నికలలో బొబ్బిలి నియోజకవర్గంలో వెనుకబడిన కులాల సత్తా చాటాలని నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు మామిడి వాసునాయుడు అన్నారు. మండల పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రానున్న ఎన్నికలలో ఓట్లు కోసం చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు బీసీలపై అమితమైన ప్రేమ చూపిస్తున్నారని ఆ కపట మాటలు బీసీలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు బీసీలను విస్మరించిన చంద్రబాబు నేడు బీసీ డిక్లరేషన్ పేరిట కపట ప్రేమ చూపడం విడ్డూరంగా ఉందన్నారు బీసీల పట్ల చంద్రబాబుకు ఎంతమాత్రం చిత్త శుద్ధి లేదన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఏమి చేయని చంద్రబాబు అధికారంలోకి వస్తే రైతులకు, మహిళలకు ఏదేదో చేస్తానని వాగ్దానాలు ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అన్ని వర్గాల ప్రజల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వం పట్ల మరింత విశ్వసనీయత పెరిగిందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మరో చారిత్రక విజయాన్ని నమోదు చేయడం ఖాయమని జోస్యంచెప్పారు. కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, నియోజకవర్గం జేసీఎస్ ఇన్‌చార్జి శంబంగి వేణుగోపాలనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు అప్పికొండ లక్ష్మునాయుడు, పాల సొసైటీ అధ్యక్షుడు చొక్కాపు రామకృష్ణ, మండల యూత్ అధ్యక్షుడు పత్తిగుళ్ల ఏక్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంతి



రాజాం: జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ తలే రాజేష్



రాజాం సిటీ: బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు



బొబ్బిలి: కొత్తూరులో జగ్జీవన్ రామ్ జయంతి



తెర్లాం: 5 అంగన్‌వాడీ కేంద్రంలో బాబూ జగ్జీవన్ రామ్ జయంతి

జగ్జీవన్‌రామ్ జయంతి పలుచోట్ల శుక్రవారం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను పలువురు కొనియాడారు. దేశాభివృద్ధిలో ఆయన చేసిన సేవలు నేటి యువతరానికి ఆదర్శమని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్

సీఎం జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి



సంతకవిటి: రామారాయపురంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న తలే రాజేష్

సంతకవిటి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని రాజాం వైఎస్సార్‌సీపీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ అన్నారు. ఇంటింట ప్రచారం కార్యక్రమంలో భాగంగా మండల పరిధి మోదుగులపేట, ముకుందపురం, గోవిందపురం, వెంపలపేట, రామారాయపురం, షాలీపేట, చింతలపేట, మిర్తివలస, చిన మిర్తివలస గ్రామాలలో శుక్రవారం పర్యటించారు. ఆయనకు ఆయా గ్రామాల ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికి వెళ్లిన ఆయన గత 58 నెలల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలును వివరించారు. పేదల బతుకులు బాగు చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మనమందరం అండగా నిలిచి మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని అన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బెల్లాన చంద్రశేఖర్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్ మోహన్‌రావు, జేసీఎస్ కన్వీనర్ రాగోలు రమేష్‌నాయుడు, మాజీ వైస్ ఎంపీపీ గంట్రేటి కేసరి, మోదుగులపేట సర్పంచ్, ఎంపీటీసీలు రెడ్డి స్వామినాయుడు, కనకల సన్యాసినాయుడు, గోవిందపురం సర్పంచ్ రాగోలు పద్మజ, ఎంపీటీసీ వి.శ్రీనివాసనాయుడు, మిర్తివలస సర్పంచ్ రాజాపు భూపతి, ఎంపీటీసీ రాజాపు రమణ, సర్పంచ్‌లు వి.రమణ, ఎమ్.మోహన్, డి.దాలినాయుడు, జి.షణ్ముఖ, బి.జ్యోతీశ్వరరావు, కె.వి.నాయుడు, మండల వ్యవసాయశాఖ సలహా మండలి అధ్యక్షుడు సీహెచ్ వెంకటపతిరాజు, గృహసారథులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఊపందుకున్న వైఎస్సార్‌సీపీ ప్రచారం



బొబ్బిలి రోడ్డులో ప్రచారంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు

రాజాం : పట్టణంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రచారం జోరుగు సాగుతోంది. పట్టణంలో మెంతిపేట, మల్లయ్యపేట, ఆదర్శనగర్, హరిజనవీధి తదితర వార్డుల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు శుక్రవారం ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్యలు ఇంటింటికి వెళ్లి సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు. రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్‌ని, ఎంపీగా బెల్లాన చంద్రశేఖర్‌ని అత్యధిక ఓట్లు మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ పాలవలస గోపి, పార్టీ నాయకులు దూబ గోపాలం, ఆర్నేపల్లి వెంకటనాయుడు, జేసీబీ శ్రీను, ఓలేటి గణపతి, వెంపల లక్ష్మణరావు, యందవ చిన బాబు, సత్యానారాయణ, గోకవలస బాబూరావు, వై.జయరాం మాస్టరు, కొల్లా రమ్య, యందవ సుశీల, కెల్ల సతీష్, అల్లెన జయలక్ష్మి పాల్గొన్నారు.

12మంది వలంటీర్ల రాజీనామా



జై జగన్ అంటున్న రాజీనామా చేసిన వలంటీర్లు

బొబ్బిలి: పట్టణంలోని 30, 31 వార్డుల నుంచి 12మంది వలంటీర్లు తమ రాజీనామాలను కమిషనర్ ఎల్.రామలక్ష్మికి అందజేశారు. వలంటీర్లు ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనకూడదని, సంక్షేమ కార్యక్రమాల అమల్లో పాలుపంచుకోకూడదని టీడీపీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈసీ ఆంక్షలు విధించిన నేపథ్యంలో తాము జగనన్న పక్షాన నిలబడేందుకు రాజీనామా చేస్తున్నట్టు వారు తెలిపారు. ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిన జగన్‌మోహన్ రెడ్డి లాంటి సీఎం రాష్ట్రానికి రావడం అభినందనీయం, అదృష్టమని, అందరూ భావిస్తున్న నేపథ్యంలో ఈ కొర్రీలేంటని వారు ప్రశ్నించారు. అందుకే తమ రాజీనామాలను కౌన్సిలర్ వాడపల్లి వనజ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్‌కు సమర్పించారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ తామంతా సీఎం జగనన్న పక్షాన నిలబడి ఎమ్మెల్యే శంబంగి గెలుపునకు కృషి చేస్తామని చెప్పారు.

92శాతం పింఛన్ల పంపిణీ



రేగిడి: పింఛన్లు పంపిణీ పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్యామలాకుమారి



రామభద్రపురం: నాయుడువలలో ఇంటికి వెళ్లి మంచంపట్టిన దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుడికి పింఛను అందజేస్తున్న వీఆర్వో

రేగిడి : మండలంలో 92 శాతం మేర పింఛన్ల పంపిణీ పూర్తయిందని ఎంపీడీఓ శ్యామలాకుమారి శుక్రవారం తెలిపారు. రేగిడి, ఆమదాలవలస, ఉంగరాడ తదితర గ్రామాల్లో జరుగుతున్న పింఛన్ల పంపిణీని పరిశీలించారు. లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పింఛన్లు అందేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. బెడ్‌రెస్ట్ పేషెంట్లుకు, దివ్యాంగులకు ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ అందజేశామని వివరించారు.

సజావుగా పింఛన్ల పంపిణీ

రామభద్రపురం: మండలంలో సచివాలయాలు వద్ద శుక్రవారం పింఛన్ల పంపిణీ సజావుగా సాగింది. పింఛను కోసం సచివాలయాలు వద్దకు వెళ్లేందుకు అవ్వాతాతలు, దివ్యాంగులు, అక్కాచెల్లెమ్మలు మండుటెండలో నడుచుకుంటూ ఇబ్బందులు పడ్డారు. గ్రామాలలో సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు ఇంటింటికీ వెళ్లి మంచం పట్టిన దీర్ఘకాలిక రోగులకు పింఛన్లు అందజేశారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత

రాజాం సిటీ: మండల పరిధి ముద్దాడజోగివలస పంచాయతీ గెడ్డవలస గ్రామానికి చెందిన కొత్తపల్లి లచ్చమ్మ అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమెకు వెల్ఫేర్ అసిస్టెంట్ సంతోష్ శుక్రవారం పింఛన్ అందించాడని ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు తెలిపారు. మండలంలో 98 శాతం మేర పింఛన్లు పంపిణీ పూర్తి చేశామని, మిగిలినవి ఈ నెల 6 నాటికి పూర్తి చేయనున్నామని వెల్లడించారు.

సంక్షిప్తంగా..

వివాదాల జోలికి వెళ్లొద్దు...

రేగిడి : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో వివాదాలు రాకుండా చూసుకోవాలని ఎస్ఐ ఇ.శ్రీనివాసరావు సూచించారు. మండలంలో పుర్లి గ్రామంలో గ్రామస్తులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరగాలని, శాంతియుత వాతావరణం ఏర్పాటు చేసుకోవాలని కోరారు. గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

మరింత నిఘా

రామభద్రపురం: సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రధాన అంతరరాష్ట్ర సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టు వద్ద పోలీస్ శాఖ భారీ బందోబస్తు ఏర్పాటు చేసి ప్రత్యేక నిఘా పెట్టింది. అంతరరాష్ట్ర కూడలి అయిన రామభద్రపురం మండల కేంద్రం బైపాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్టు వద్ద శుక్రవారం సీఐ తిరుమలరావు, ఎస్ఐ జ్ఞానప్రసాద్‌లు సిబ్బందితో కలిసి కట్టుదిట్టంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో మరింత నీఘా పెడుతూ వాహన తనిఖీలు చేస్తున్నామన్నారు.

శతశాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలి

తెర్లాం: మండలంలోని 21 గ్రామ సచివాలయాల్లో గతకొన్ని రోజులుగా చేపట్టిన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం సాయంత్రంలోగా శతశాతం పూర్తి చేయాలని ఎంపీడీవో బి.మధుసూదనరావు అన్నారు. పింఛన్ల పంపిణీపై శుక్రవారం పలు గ్రామాల పంచాయతీ, సచివాలయ కార్యదర్శులతో ఆయన మాట్లాడారు. మండలంలోని 21 గ్రామ సచివాలయాల పరిధిలో 9వేల 858మంది పింఛన్‌దారులు ఉన్నారని తెలిపారు. ఇంతవరకు 80శాతంకు పైగా పింఛన్ల పంపిణీ పూర్తయ్యిందని, మిగిలిన 20శాతం పింఛన్లు శనివారం సాయంత్రంలోగా పూర్తి చేయాలన్నారు. సచివాలయాల వద్ద, పంచాయతీ కార్యాలయాల వద్ద జరుగుతున్న పెన్షన్ల పంపిణీకి సంబంధించి పెన్షనర్లు కోసం టెంట్లు, తాగునీరు ఏర్పాటు చేయాలని సూచించారు. 21 గ్రామ సచివాలయాల్లో తప్పనిసరిగా శతశాతం పెన్షన్ల పంపిణీ పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో కోరారు.

లాభదాయకంగా మొక్కజొన్న

రేగిడి : మండలంలో ఈ ఏడాది రబీలో రైతులు అధికంగా మొక్కజొన్న పంటను సాగు చేశారు. ప్రస్తుతం పంట కోత దశకు చేరుకోవడంతో రైతులు పంటను దక్కించుకునే ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఎకరాకు 22 క్వింటాళ్ల వరకూ మొక్కజొన్న పప్పు దిగుబడి వస్తుందని, క్వింటా ధర రూ.2200లు వరకూ పలుకుతుందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం అన్ని ప్రాంతాల్లోని రైతులు పంటను నూర్పిడి చేసి, పప్పును విక్రయించేందుకు సిద్ధం చేస్తున్నారు.

నిరుపేదకు నిత్యావసర వస్తువులు

బొబ్బిలి: పట్టణంలోని నేను సైతం స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు బొంగు గౌరీ సంతోష్ కుమార్ జన్మదినం సందర్భంగా పట్టణంలోని పేదలకు అన్నదానం చేశారు. ఓ నిరుపేద కుటుంబానికి నెలకు సరిపడ నిత్యావసర సరుకులను అందజేశారు.

ప్రజలు శాంతియుతంగా మెలగాలి

వంగర: గ్రామాల్లో ప్రజలు శాంతియుతంగా మెలగాలని ట్రైనీ డీఎస్పీ మహేంద్ర కోరారు. గురువారం రాత్రి శివ్వాంలో పర్యటించారు. ప్రజలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎన్నికలు వేళ ప్రజలంతా సోదర భావంతో ఉండాలని, ఎటువంటి వివాదాలకు పాల్పడినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్ఐ వై.వి.జనార్దన్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ముమ్మరంగా తాగునీటి బోర్ల మరమ్మతులు

సంతకవిటి: మండల పరిధి కాకరాపల్లిలో ముమ్మరంగా తాగునీటి బోర్లు మరమ్మతులు చేపడుతున్నారు. క్రాష్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని పలు వీధుల్లో మరమ్మతులకు గురైన బోర్లును బాగుచేసి తాగునీటి సరఫరా చేపడుతున్నారు. కార్యక్రమంలో బోర్‌మెకానిక్‌లు త్రినాధ్, క్రిష్ణమూర్తి, మన్మధరావులున్నారు.

రాజాంలో..

రాజాం : గ్రామాల్లో వేసవిని దృష్టిలో ఉంచుకుని క్రాష్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ముద్దాడజోగివలస, గార్రాజుచీపురుపల్లి గ్రామాల్లో తాగునీటి బోర్లు పరిశీలించి, అవసరమైన వాటికి మరమ్మతులు జరిపామని అన్నారు. రూ. 5 లక్షలతో విడి పరికరాలు కొనుగోలుచేశామని వివరించారు.

నేడు క్యాంపస్ ఇంటర్వ్యూలు

బొబ్బిలి: స్థానిక రాజా కళాశాలలో గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో శనివారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ సీహెచ్ వీరేంద్ర కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఇంటర్వ్యూలకు 2021 నుంచి 2024 వరకూ ఇంటర్ ఎంపీసీ, బైపీసీ పూర్తి చేసిన వారు లేదా ఈ ఏడాది పరీక్షలు రాసిన వారు అర్హులన్నారు. ఎంపికైన వారికి రెండు నెలల పాటు ఉచిత వసతి, భోజన సదుపాయాలతో ఇచ్చే శిక్షణలో రూ.5వేల భృతి ఇస్తారన్నారు. అనంతరం ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. శనివారం ఉదయం అన్ని ధృవపత్రాలతో కళాశాలలో హాజరు కావాలన్నారు.

గ్రామాల్లో పోలీసుల కవాతు

వంగర: మండల పరిధి బాగెంపేట, శ్రీహరిపురం, శ్రీహరిపురం ఆర్అండ్ఆర్ కాలనీల్లో శుక్రవారం పోలీసులు కవాతు నిర్వహించారు. ట్రైనీ డీఎస్పీ మహేంద్ర ఆధ్వర్యంలో జరిగిన కవాతులో ప్రజలను చైతన్యం చేశారు. గ్రామాల్లో అసాంఘిక శక్తులు అల్లర్లుకు పాల్పడకుండా నిరోధించడానికి కవాతు ఉద్దేశమని డీఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో రాజాం రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ వై.వి.జనార్దన్, కేంద్ర బలగాలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తీరిన లోవోల్టేజీ సమస్య

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధి మారుతీనగర్ ఒకటవ లైన్‌కు ఎట్టకేలకు అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో లోవోల్టేజీ సమస్య తీరింది. విద్యుత్ సమస్యను దృష్టిలో ఉంచుకుని కాలనీలో శుక్రవారం అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశామని ఏఈ కుమార్ తెలిపారు. పట్టణంతో పాటు మండలంలో ఎక్కడా విద్యుత్ సమస్య లేకుండా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. గత కొంతకాలంగా ఈ ప్రాంతంలో విద్యుత్ లోవోల్టేజీతో పడుతున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకువెళ్లామని కాలనీవాసులు తెలిపారు.

రూ. 3లక్షలతో సీసీ డ్రైనేజీ నిర్మాణం

రాజాం : మండలంలోని బొద్దాం గ్రామంలో రూ.3 లక్షలతో సీసీ డ్రైనేజీ నిర్మాణం చేపట్టారు. గ్రామంలోని కొత్త వీధిలో ఎన్నో ఏళ్లుగా మురుగు కాలువ లేక ప్రజలు ఇబ్బందులు పడ్డారని సర్పంచ్ నక్క తవిటమ్మ, వైస్ ఎంపీపీ నక్క వర్షిణి తెలిపారు. 15వ ఆర్థిక సంఘ నిధులుతో ఈ సీసీ డ్రైనేజీ నిర్మాణం పూర్తి చేయడంతో ఆ కాలనీలోని ప్రజలకు మురుగునీటి కష్టాలు తప్పాయని వెల్లడించారు.

భానుడి భగభగ

రేగిడి: వేసవి ఎండలు తీవ్రమయ్యాయి. ఉదయం 9 గంటల నుంచే ఎండ తీవ్రత అధికంగా ఉండి, ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. ప్రజలు రోడ్లపైకి రాని పరిస్థితి కనిపిస్తుంది. శుక్రవారం ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో నిత్యం రద్దీగా ఉండే ఉంగరాడ మెట్టతో పాటు అన్ని ప్రాంతాల్లో ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా కనిపించాయి.

జిల్లా అధ్యక్షుడిగా ప్రదీప్

బొబ్బిలి: దళిత ఇండస్ట్రియల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా చింతాడ జయప్రదీప్‌ను నియమితులయ్యారని ఆ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ సుదర్శన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జయప్రదీప్‌ను పలువురు అభినందించారు.